క్లుప్తంగా

రుణాల చెల్లింపులపై అవగాహన



మరికల్: సింగిల్ విండో సొసైటీలో రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను చెల్లించి సహకరించాలని విండో చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. నర్వ విండో పరిధిలోని కన్మనూర్‌లో రుణాలు చెల్లించాలని రైతులకు అవగాహన కల్పించారు. గతంలో స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను తీసుకున్న రైతులు తప్పకుండ చెల్లించాలని కోరారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులను ఆయన అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ధన్వాడ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, డైరెక్టర్ రామేశ్వర్‌రెడ్డి, ఎల్లప్ప, వెంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్‌లో వెలసిన శనేశ్వరస్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి పురస్కరించుకుని అర్చకులు స్వామివారి మూల విరాట్ విగ్రహానికి తైలాభిషేకం, పుష్పాలంకరణ, నల్లటి వస్త్రాలతో అలంకరించారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. వివిధ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు, భక్తులు, మహిళలు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మరికల్: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఎన్‌ఆర్‌జీఎస్ కింద శనివారం సీసీరోడ్డు పనులను సర్పంచ్ గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాలనీలలో సీసీ రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. కాలనీ వాసులు పనులకు ఆటంకం కలిగించకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

7న హోలీ



మక్తల్: ఈనెల 7వ తేదీన హోలీ వేడుకలను జరుపుకోవాలని వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఈనెల 6న సోమవారం రాత్రికి కామదహనం నిర్వహించి, మరుసటి రోజు హోలీ పండుగను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాద్వార్ ఆశప్ప, పట్టణ అధ్యక్షుడు వాకటి భీమన్న, కార్యదర్శి మల్లికార్జున్, రమేష్, బీమేష్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లను అప్పగించండి

ధన్వాడ: మండలంలోని గోటూర్ ప్రాథమిక పాఠశాలలో ఎన్‌ఆర్‌జీఎస్‌లో నిర్మించిన మరుగుదొడ్లను అప్పగించాలని పాఠశాల ఉపాధ్యాయులు కోరుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు కాంట్రాక్టర్ పూర్తి చేసినా నిధులు విడుదల కాకపోవడంతో అప్పగించలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు పాఠశాలకు అప్పగించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు.

రేపు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

ధన్వాడ: మండలం పరిధిలోని మైనారిటీ కార్పొరేషన్ నుంచి 2022–23 సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు లింక్, నాన్ బ్యాంక్ లింక్ స్కీం కింద రుణాల మంజూరు కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ సద్గుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్, బాలికల తదితర పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నాణ్యమైన విద్య కోసం ఏవీఎన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కా ర్యక్రమంలో నర్సింహా, శ్రీనివాస్, నాజ్మిన్, న హీం, నిరంజన్, రవిందర్, జానకి, రాధిక, పర్వీన్, యమున, ధర్మరాజు, జ్యోతి పాల్గొన్నారు.

అమ్మో పులి

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాల సమీపంలో శనివారం సాయంత్రం పులి సంచరించింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గట్టు పక్కన ఉన్న చెట్ల పొదల్లో పులి కనిపించిందని విద్యార్థులు తెలిపారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో జంకుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ రాజారాం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

పారిశుధ్యం పట్టించుకోండి సారూ!

- రోడ్లపై పారుతున్న మురుగు
- చెరువుల్లా మారిన డ్రైయినేజీలు
- మురుగు నిల్వతో దుర్వాసన



ఎస్సీ కాలనీలో నిలిచిన మురుగు



యాద్గీర్ ప్రధాన రహదారిలో అసంపూర్తి పనుల కారణంగా నిలిచిన మురుగు

నారాయణపేట టౌన్: మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీ, శ్యాసన్‌పల్లి రోడ్ మార్గంలో డ్రైనేయిజీ పనులు అసంపూర్తిగా చేపట్టడంతో మురుగు దారి పొడువునా పారుతోంది. డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో మురుగు ముందుకు వెళ్లే మార్గం లేకపోవడంతో దుర్వాసన రావడంతో పాటు దోమలు చేరి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఏటా మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులు చేయడానికి రూ.లక్షలు వెచ్చిస్తున్నా ఫలితం లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు. పట్టణంలోని కాలనీల్లో మురుగు నిల్వకాకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి అవసరమైన చోట డ్రెయినేజీలు నిర్మించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మొదటి నుంచి నిర్లక్ష్యమే..

పట్టణంలోని యాద్గీర్ రోడ్ ప్రధాన రహదారి పక్కన తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర ఉన్నత కళాశాల, ఎస్సీ కాలనీ వెళ్లే దారిలో ప్రధాన డ్రెయినేజీ పనులు అసంపూర్తి చేపట్టడంతో రోడ్లపై మురుగు పారుతుంది. మూడు నెలల క్రితం బాలుర కళాశాలను సందర్శించడానికి వచ్చిన అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ ఇదేమి పనులు అంటూ అధికారులను నిలదీశారు. వెంటనే పనులను చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించినా.. నేటికీ అక్కడ పరిస్థితి అలాగే ఉంది. ఉన్నతాధికారులు ఆదేశించినా కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు కావడం లేదని స్థానికుల ఆరోపిస్తున్నారు. దీంతో నిత్యం రోడ్లపై మురుగు పారడంతో రోడ్లు అధ్వానంగా గుంతలమయంగా మారుతున్నాయి. ఇక వర్షాకాలం వస్తే వర్షపు నీటికి మురుగు తోడై రోడ్లపై నిలిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నూతనంగా డ్రెయినేజీలను నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



పట్టణంలో ప్రధాన రహదారిలో మురుగు కుంటలుగా మారడంతో దుర్వాసన వెదజల్లుతోంది. డ్రెయినేజీ సక్రమంగా లేక రోడ్లపై మురుగు పారడంతో తీవ్ర అవస్థలకు గురవుతున్నాం. వెంటనే సంబంధిత అధికారులు మురుగు కాల్వలను నిర్మాణం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలి. – చంద్రప్ప, నారాయణపేట

పనులు చేపడతాం

ప్రస్తుతం పట్టణంలో మురుగు కాల్వల నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌కో అధికారులు తొలగిస్తే అసంపూర్తిగా కొనసాగుతున్న పనులు వేగవంతం చేపట్టి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటాం. – సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

పంచాయతీ భవన నిర్మాణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సర్పంచు నారాయణరెడ్డి

ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం సర్పంచు నారాయణరెడ్డి పనులను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ భవనలు లేని గ్రామ పంచాయతీలకు భవన నిర్మాణాలకు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్ అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ సీతయ్య

మక్తల్: ఊట్కూర్ మండలం తిమ్మారెడ్డిపల్లి తండా స్టేజీ వద్ద ట్రాక్టర్ ట్రాలీని నిర్లక్ష్యంగా ఆపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ సీతయ్య తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత నెల 28న నారాయణపేట మండలం బసిరెడ్డిపల్లితండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జానిమియ్యా తిమ్మారెడ్డిపల్లితండా వద్ద రోడ్డుపై ట్రాక్టర్ ట్రాలీ నిర్లక్ష్యంగా వదిలి వెళ్లాడు. ధన్వాడ మండల కేంద్రానికి చెందిన సుధాకర్ (30) బైక్‌పై వస్తున్న సమయంలో రోడ్డుపై ఆపిన ట్రాలీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృత్యుడి భార్య ఫిర్యాదు మేరకు డ్రైవర్ జానిమియ్యాపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నారాయణపేట రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జీసీడీఓ పద్మనళిని అన్నారు. శనివారం మండలంలోని జాజాపూర్ జెడ్పీ హైస్కూల్‌ను టాస్ కో ఆర్డినేటర్ యాదయ్యశెట్టితో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. హాజరుశాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీచర్లకు సూచించారు. ప్రీఫైనల్ పరీక్ష పత్రాలను పరిశీలించారు. వేకప్‌కాల్ గురించి వాకాబు చేశారు. స్టడీ అవర్స్, వీక్లి టెస్టులపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సత్యనారాయణ, టీచర్లు భానుప్రకాష్, మాధవి పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ

బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర' రెండోరోజు శనివారం మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లి, తిమ్మాయపల్లి గ్రామాల్లో కొనసాగింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు మద్దతుగా మండల పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ యాత్రలో పాల్గొన్న నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అరాచక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.400లకే గ్యాస్ సిలిండర్ ఇస్తే నేడు బీజేపీ ప్రభుత్వం రూ.1,200లకు పెంచి పేదల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రజలను మాయమాటలతో పాలిస్తూ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భానునాయక్, నాయకులు నాగులపల్లి నరేందర్, సలీం, విద్యాసాగర్, హరీష్, ఓంప్రకాష్, ప్రభోత్తం, టెంట్ నర్సింహ, నాచారం వెంకట్రాములు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం శివారులో నిల్వ చేసిన పశుగ్రాసం దగ్ధమై రూ.35 వేల ఆస్తి నష్టం సంభవించిన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు కనకప్ప గ్రామ శివారులోని పొలం వద్ద పశుగ్రాసం నిల్వ చేశారు. ఉదయం వేళ పశుగ్రాసానికి నిప్పంటుకున్న విషయం పలువురు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే నిల్వ చేసిన రెండు టాక్టర్ల శనగపొట్టు, జొన్న చొప్ప, రెండు టాక్టర్ల గడ్డి పూర్తిగా కాలిపోయింది. దీంతో సుమారు రూ.35 వేల ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కోస్గి మండలం గుండుమాల్‌లో..



కోటకొండ శిశుమందిర్‌లో...

జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. అనంతరం నిర్వహించిన సమావేశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. నారాయణపేట మండలంలోని శేర్నపల్లి, సింగారం యూపీఎస్, అమ్మిరెడ్డిపల్లి, ఊటకుంటతండా పీఎస్, కొల్లంపల్లి జెడ్పీ హైస్కూల్, కోటకొండ శిశుమందిర్ పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాగనూర్ మండల కేంద్రంతో పాటు, నేరడగం పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వాహించారు. ధన్వాడ మండలం కంసాన్‌పల్లి ప్రాథకమిక పాఠశాలలో స్వపరిపాలనా దినోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు పాఠశాలకు ఉచితంగా స్మార్ట్ టీవీని బహూకరించారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులే ఉపాధ్యాయుగా మారి పాఠ్యాంశాలు బోధించారు. మండలంలోని గోల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో, ఊట్కూరు జీపీఎస్‌లో, మరికల్‌తో పాటు కన్మనూర్ పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కోస్గి మండలంలోని నాచారం ప్రాథమికోన్నత పాఠశాల, గుండుమాల్ వికాస్ ఉన్నత పాఠశాల, మద్దూరు మండలంలోని రెనివట్ల బాలికల ప్రాథమిక పాఠశాల, గుడ్లలక్ష్మిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



మాగనూరులో..



మక్తల్‌లో..



మద్దూరులోని గుండ్లలక్ష్మిపల్లి పాఠశాలలో..

ఎదిరించే గళాన్ని మండలికి పంపిద్దాం

నారాయణపేట రూరల్: నియంతృత్వ పోకడలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కేసీఆర్‌ను ఎదిరించే గళాన్ని మండలికి పంపిద్దామని మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మేధావి, విద్యావేత్త, ఉపాధ్యాయ వృత్తిలో చక్కటి అనుభవం ఉందని, ప్రతీ టీచర్ గడపకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును అభ్యర్థించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రతంగపాండురెడ్డి, రఘువీర్‌యాదవ్, కెంచె శ్రీనివాస్, భరత్, రఘురామయ్యగౌడ్, బాల్‌రెడ్డి, రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.



రాంచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొమరం భీం జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికలు స్కూల్, పీహెచ్‌ఈఎస్, మైనార్టీ గుకులకుల పాఠశాలల్లో పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ ఎంతో కృషి చేసిందన్నారు. గుర్రం చెన్నకేశవ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, వాణిశ్రీ, జహీరోద్దిన్, సుదర్శన్, శ్రీనివాస్, నాజ్మిన్‌బేగం, శశికుమార్, హనీఫ్ పాల్గొన్నారు.

ఊట్కూరు: లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తపస్ సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామని జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఊట్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని, బదిలీలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా ప్రభుత్వ లెక్చరర్‌గా సేవలు అందించి విద్యారంగంపై సుదీర్ఘమైన అనుభవం కలిగిన ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంబాజీ, జిల్లా కార్యదర్శి నరసింహ, సత్యనారాయణ, మంజునాథ్, బక్కయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు టీవీ బహూకరణ



టీవీ బహూకరిస్తున్న రామునాయక్

నారాయణపేట రూరల్: మండలంలోని ఊటకుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బీజేపీ గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు రామునాయక్ ఎల్‌ఈడీ టీవీని బహూకరించారు. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహా, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి మొల్గాన్‌జనార్దన్, క్లస్టర్ హెచ్‌ఎం రవికుమార్, సర్పంచ్ సీతమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, టీచర్లు, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

నారాయణపేట రూరల్ : ప్రభుత్వం భాషోపాధ్యాయులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని, కోర్టు కేసుల పేరుతో జాప్యం తగదని మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా రిటైర్డ్ డీఈఓ, బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జిల్లాలో పర్యటించి పలువురు ఉపాధ్యాయుల ఇంటికి వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం స్థానిక హిందీ ప్రచార్ సమితిలో విలేకరులతో మాట్లాడుతూ విద్యా వ్యవస్థ, ఉపాధ్యాయ సమస్యలపై పూర్తి అవగాహన కల్గిన వ్యక్తులు మండలికి పంపిస్తే తగిన న్యాయం జరుగుతుందని అన్నారు. దశాబ్దాల కాలంగా విద్యారంగంలో సేవ చేశానని వివరించారు. సమావేశంలో భాషోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, గౌరీశంకర్, రాష్ట్ర సహ అధ్యక్షుడు సత్యనారాయణకాంబ్లే, నాయకులు యశ్వంత్, లక్ష్మీకాంత్, సురేష్, రమేష్, అబ్దుల్ రజాక్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వాల్మీకి బోయల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నర్వ: రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి బోయల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం నర్వ మండలంలో వాల్మీకి బోయల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు నుంచి రూ.8 లక్షలు మంజూరు చేసినందుకు మండల నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మాణం ప్రవేశపెట్టారన్నారు. మండలంలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ. 8 లక్షలతో పాటు మరో రూ. 4 లక్షల అదనంగా ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వాల్మీకి బోయ సంఘం మండల అధ్యక్షుడు గడ్డం నర్సిములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మండ్ల చిన్నయ్య, నాయకులు భగవంతు, కల్వాల్ ఆంజనేయులు, సర్పంచు రాములు, రాజు, శ్రీనివాసులు, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహ ఇంటర్, డిగ్రీ చివరి సంవత్సరం విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ ఉన్నత విద్య అభ్యసించడానికి వచ్చిన ప్రతి ఒక్కరు కష్టపడి చదువుకోవాలని, పేరెంట్స్‌కు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. వార్డెన్ మంజుల రేణుక, మసూద్, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న పోలీస్ బృందం సభ్యులు

కోస్గి: నేటి సమాజంలో సాంకేతికత ఎంత అభివృద్ధి చెందిందో అదే విధంగా సైబర్ నేరాలు సైతం పెరిగాయని, వాటితో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై శ్రీదేవి సూచించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, బాలకార్మిక వ్యవస్థ, షీటీంతో పాటు పలు అంశాలపై పోలీసు కళాజాత బృందంతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ మహిళలు, బాలికలపై వేధింపుల నుంచి రక్షించడమే షీ టీం ప్రధాన లక్ష్యమన్నారు. ఎవరైన బాలికలు వేధింపులకు గురవుతున్న, ఆకతాయిలు ఆకృత్యాలకు పాల్పడుతున్నా మౌనంగా భరించకుండా నేరుగా 100కు ఫోన్ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, బ్యాంకు మోసాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.